క్లుప్తంగా

అగ్గిపుల్లపై సూక్ష్మ గణపతి


అగ్గిపుల్లపై సురేష్ బాబు తీర్చిదిద్దిన గణేశ్ ప్రతిమ

ఏలూరు (టూటౌన్): వినాయక చవితి సందర్భంగా సూక్ష్మ కళాకారులు అతి చిన్న గణపతి విగ్రహాలను తయారు చేసి అబ్బురపరుస్తున్నారు. ఏలూరుకు చెందిన సూక్ష్మ కళాకారుడు దొరశివ ప్రసాద్ అరంగుళం సైజు రాయిపై గణపతి ప్రతిమను చెక్కారు. దానికి రంగులు అద్ది ఆకర్షణగా తీర్చిదిద్దారు. మరో సూక్ష్మ కళాకారుడు మేతర సురేష్‌బాబు అగ్గిపుల్లపై గణపతి చిత్రాన్ని రూపొందించారు. సూక్ష్మ కళాకారులు తమదైన శైలిలో గణపతిని చిత్రీకరించడంపై నగర వాసులు అభినందిస్తున్నారు. ప్రతి పండుగ, విశేష రోజుల్లో ఈ ఇద్దరు సూక్ష్మ కళాకారులు తమదైన శైలిలో స్పందించడంపై నగర వాసులు అభినందనలు తెలియజేస్తున్నారు.

ఏలూరు రూరల్ తహసీల్దార్‌గా శ్రీనివాస్



ఏలూరు రూరల్: ఏలూరు రూరల్ మండలం తహసీల్దార్‌గా జేఎస్ శ్రీనివాస్ నియామకమయ్యారు. శనివారం ఆయన ఏలూరు తహసీల్దార్ బి సోమశేఖర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి తహసీల్దార్ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ ఆయన అమలాపురం తహసీల్దార్ కార్యాలయంలో అడ్మిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం కొద్ది నెలల క్రితం ఏలూరు మండలాన్ని ఏలూరు, ఏలూరు రూరల్‌గా విభజించిన సంగతి తెలిసిందే. ఏలూరు నగర కార్పొరేషన్ పరిధి తహసీల్దార్‌గా సోమశేఖర్, చాటపర్రు కేంద్రంగా ఏలూరు రూరల్ తహసీల్దార్‌గా శ్రీనివాస్ పని చేయనున్నారు. సిబ్బందిని నియమించే వరకూ శ్రీనివాస్ ఏలూరు తహసీల్దార్ కార్యాలయం నుంచే సేవలందించనున్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి


మేయర్ నూర్జహాన్ దంపతులకు మట్టి గణపతి ప్రతిమలు అందజేస్తున్న దృశ్యం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): పర్యావరణ పరిరక్షణకు కేవలం ప్రజలు, అధికారులు, ప్రజా ప్రతినిధులు కృషి చేయాలని ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్, పెదబాబు దంపతులు సూచించారు. తెనాలి డబుల్ హార్స్ సంస్థ ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చే కార్యక్రమాల్లో భాగంగా ఆ సంస్థ ప్రతినిధి దుర్గ సత్యవతి ఆదివారం మేయర్ దంపతులను కలిసి వారికి మట్టి గణపతి ప్రతిమలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీహెచ్ సంస్థ మట్టి గణపతి ప్రతిమల పంపిణీ చేయడం ఆహ్వానించ దగ్గ పరిణామమన్నారు.

హైందవ సంస్కృతిని కాపాడుకోవాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): వారసత్వ సంపదగా వచ్చిన పండగలు, ఉత్సవాల నిర్వహణ ద్వారా హైందవ సంస్కృతిసంప్రదాయాలను ప్రతి ఒక్కరూ కాపాడాలని మాజీ ఉప ముఖ్యమంత్రి ఆళ్ల నాని అన్నారు. ఆదివారం ఆళ్ల నాని క్యాంపు కార్యాలయంలో జ్వాలా పహారేశ్వర స్వామి చిల్లర కూరగాయల వర్తక సంఘం నిర్వహిస్తున్న గణేష్ ఉత్సవాలకు ఆహ్వానించేందుకు వర్తక సంఘం నాయకులు ఆళ్ల నానిని కలిశారు. ఈ సందర్భంగా వారు ఆహ్వాన పత్రికను ఆళ్లనానికి అందించారు. ఈ సందర్భంగా ఆళ్ల నాని ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. సంఘం అధ్యక్షుడు బొద్దపు గోవిందు, కోలా భాస్కరరావు, అగ్రహారపు శివ, కర్రా చిన్న, బోండా రాజా, తుంపాల గంగాధరరావు, పొలిమేర రాజు, ఏ. ప్రసాదు పాల్గొన్నారు.

22న రౌండ్ టేబుల్ సమావేశం

ఏలూరు (టూటౌన్): పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని కోరుతూ ఈ నెల 22న వామ పక్ష పార్టీల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు సీపీఎం, సీపీఐ, న్యూడెమోక్రసీ పార్టీల నాయకులు తెలిపారు. అదేరోజు ఏలూరు జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నాయి. ఆదివారం సాయంత్రం సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆఫీసులో సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ.రవి, సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, న్యూడెమోక్రసీ జిల్లా అధికార ప్రతినిధి యు.వెంకటేశ్వరరావు అధ్యక్షతన వామపక్ష పార్టీల సమావేశం నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర కంట్రోల్ మిషన్ నాయకులు బండి వెంకటేశ్వరరావు, సీపీఎం ఏలూరు నగర కార్యదర్శి పళ్ళెం కిషోర్, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు బద్దా వెంకట్రావు పాల్గొన్నారు.

చవితి ఉత్సవాలకు సన్నద్ధం

- గణపతి ప్రతిమలు, పత్రి విక్రయ దుకాణాల వద్ద రద్దీ
- వినాయక విగ్రహాల కొనుగోళ్లకు ఉత్సవ కమిటీల రాక
- తీన్‌మార్ డప్పులు, బాణసంచాతో విగ్రహాల తరలింపు


విక్రయానికి సిద్ధం చేసిన పాలవెల్లులు, గొడుగులు


పత్రి, మామిడి ఆకులు విక్రయిస్తున్న దృశ్యం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): వినాయక చవితి పండుగను పురస్కరించుకుని ఆదివారం నగరమంతా సందడి సందడిగా మారింది. అందరిలోనూ హడావుడి కనిపించింది. నగర ప్రజలంతా దాదాపు రహదారులపైకి చేరుకున్నారు. దీనితో ప్రధాన రహదారులన్నీ జనమయమయ్యాయి. ఆదివారం సెలవుతో పాటు సోమవారం పండుగ సెలవు కూడా రావడంతో జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో ఉంటున్న నగర వాసులు, ఇతర జిల్లాల్లో ఉన్న ప్రజలు సైతం వినాయక చవితి పండుగ కోసం శనివారం రాత్రి నుంచే నగరానికి చేరుకున్నారు. నగరంలోని దాదాపు ప్రతి వీధిలోనూ గణపతి నవరాత్రి ఉత్సవాలు నిర్వహించడానికి ఆయా ప్రాంతాల యువకులు కమిటీగా ఏర్పడి నిధులు సమీకరించి ఉత్సవ ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇప్పటికే తమ ప్రాంతాల్లో పందిర్లు వేసి వివిధ రకాలుగా అలంకరించారు. వారికి సమకూరిన నిధుల లభ్యత ఆధారంగా భారీ వినాయక విగ్రహాలను తమ పందిళ్లలో ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేసుకున్నారు.

ఎటు చూసినా గణపతి ప్రతిమలు, పత్రి దుకాణాలు

వినాయక చవితి అంటేనే తెలుగు ప్రజల్లో ఒక రకమైన ఉత్సాహం వెల్లువెత్తుతోంది. ప్రతి ఇంటిలో చవితి పూజలు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తారు. ఈ ఏడాది కూడా అందుకు మినహాయింపు లేకుండా ప్రజలు చవితి వేడుకల కోసం గణపతి ప్రతిమలను కొనుగోలు చేస్తున్నారు. వారి కోసం నగరమంతా మట్టి గణపతి ప్రతిమలు దర్శనమిస్తున్నాయి. కొంతమంది ముందుగానే తయారు చేసిన ప్రతిమలను అమ్మకాలకు పెట్టగా మరి కొందరు తాజాగా బంక మట్టిని తీసుకువచ్చి మూసలు, అచ్చులతో భక్తుల ఎదుటే అప్పటికప్పుడు తయారు చేసి అందిస్తున్నారు. చవితి పూజల్లో మరో ప్రధాన అంకమైన పత్రి అంటే మామిడాకులు, సీతాఫలం ఆకులు, మారేడు ఆకులు ఇలా వివిధరకాల ఆకులను, వెలగ కాయలు, జామ కాయలు, సీతాఫలాలు, బత్తాయిలు, మొక్కజొన్న పొత్తులు, తదితర రకాల కాయలను స్వామివారి మండపంగా తీర్చిదిద్దే పాలవెల్లి, స్వామి వారికి అలంకరించే గొడుగు ఇలా ఆయా పూజా సామగ్రి విక్రయించడానికి వచ్చాయి.

వినాయక విగ్రహాలు కొనుగోలుకు ఉత్సవ కమిటీల ఉత్సాహం

నగరంతో పాటు పరిసర గ్రామాల్లో నవరాత్రి ఉత్సవాల కోసం గణపతి ప్రతిమలను కొనుగోలు చేయడానికి ఉత్సవ కమిటీలు ఉత్సాహంగా ముందుకువచ్చాయి. శనివారం వరకూ మందకొడిగా సాగిన విగ్రహాల అమ్మకాలు ఆదివారం ఊపందుకున్నాయి. సుమారు 3 అడుగుల నుంచి 8 అడుగుల వరకూ సైజు ఉన్న విగ్రహాలను ఉత్సవ కమిటీలు కొనుగోలు చేశాయి. గతేడాదికి ఈ ఏడాదికి విగ్రహాల ధరల్లో కొంత పెరుగుదల కనిపించింది. విగ్రహాల సైజును బట్టి రూ. 3 వేల నుంచి రూ. 30 వేల వరకూ ధరలు పలికాయి. అయినప్పటికీ ఉత్సవ కమిటీలు వెనుకాడకుండా కొద్దిగా బేరమాడి విగ్రహాలను కొనుగోలు చేశాయి.

తీన్‌మార్ డప్పులు, బాణసంచాతో విగ్రహాల తరలింపు

నగరంలో వివిధ ప్రాంతాల్లో విక్రయానికి సిద్ధం చేసిన వినాయక విగ్రహాలను కొనుగోలు చేసిన ఉత్సవ కమిటీలు తాము ఏర్పాటు చేసుకున్న పందిళ్ల వద్దకు తరలించడానికి ఆటోలను సిద్ధం చేసుకున్నారు. విగ్రహాల తరలింపుకు ముందుగా కొబ్బరికాయ కొట్టి విగ్రహాలను ఆటోల్లోకి ఎక్కించారు. ఈ సందర్భంగా దారి పొడవునా తీన్‌మార్ డప్పులు బాణసంచాలతో విగ్రహాలను తరలించారు. ఉత్సవ కమిటీ సభ్యులు, పలువురు బాలలు గణపతి బొప్పా మోరియా అంటూ నినాదాలు చేశారు.

యువత సైనికుల్లా పనిచేయాలి

- ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్లనాని
- జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్‌గా వైఎన్‌వీ శివరావు నియామకం


పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆళ్ళనాని చేతులమీదుగా నియామక పత్రాన్ని అందుకుంటున్న వైఎన్‌వీ శివరావు

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాలు, ఏలూరు ఎంపీ సీటును కైవసం చేసుకుని, 2024 సార్వత్రిక ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బహుమతిగా ఇచ్చేందుకు వైఎస్సార్ సీపీలోని యువత, పార్టీ అభిమానులు, నాయకులు సైనికుల్లా పనిచేయాలని ఏలూరు జిల్లా పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆళ్ళనాని పిలుపునిచ్చారు. ఏలూరు శ్రీరామ్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ళనానిని ఏలూరు జిల్లా జగనన్న సచివాలయ కన్వీనర్స్ గృహసారథులు (జేసీఎస్) కోఆర్డినేటర్‌గా నియమితులైన వైఎస్‌వీ శివరావు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్‌గా నియామక పత్రాన్ని ఆళ్ళనాని చేతులమీదుగా అందుకున్నారు.

ఈ సందర్భంగా ఆళ్ళనాని మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా క్షేత్రస్థాయిలో ప్రభుత్వ కార్యక్రమాలు అమలు చేసేందుకు కృషి చేయాలన్నారు. పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులతో కలిసి సమన్వయం చేసుకుంటూ పార్టీ బలోపేతానికి పనిచేయాలన్నారు. ముఖ్యంగా రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. ప్రజలకు ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలు చేరువ చేసేందుకు సమష్టిగా పనిచేయాలని చెప్పారు. ప్రతిపక్ష పార్టీల ఆరోపణలు, అసత్య ప్రచారాలను ధీటుగా తిప్పికొట్టి వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జగన్ సేవాదళ్ నాయకులు యల్లాపు మోజెస్, బండ్లమూడి సునీల్, పిట్టా ధనుంజయ్, బీసీ నాయకులు లక్కోజు గోపీ, ఎచ్చర్ల ఉమామహేష్ తదితరులు ఉన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి


జిల్లా అధ్యక్షుడు ఆళ్ళనానిని మర్యాదపూర్వకంగా కలిసిన పార్టీ క్లస్టర్ అధ్యక్షుడు తదితరులు

ఏలూరు టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని, స్వాతంత్ర్యం అనంతరం దేశంలో ఇలాంటి సంక్షేమ పాలన ఏనాడూ చూడలేదని వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆళ్ళనాని అన్నారు. ఏలూరు శ్రీరామ్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఏలూరు క్లస్టర్ అధ్యక్షులుగా నియమితులైన పార్టీ నేతలు ఎమ్మెల్యే ఆళ్ళనానిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. వైఎస్సార్ సీపీ ఏలూరు నియోజకవర్గం క్లస్టర్ -1 అధ్యక్షులుగా కార్పొరేటర్ సుంకర చంద్రశేఖర్, క్లస్టర్-2 అధ్యక్షుడిగా డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్‌బాబు, క్లస్టర్-3 అధ్యక్షుడిగా మాజీ ఏఎంసీ చైర్మన్, జిల్లా కోశాధికారి మంచెం మైబాబు నియమితులయ్యారు. వీరంతా ఎమ్మెల్యే నానిని కలిసి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు ఆళ్ళనాని మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో అధికారం కోసం అర్రులు చాస్తున్న ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న రాజకీయ కుట్రలు, అసత్య ప్రచారాలను ధీటుగా తిప్పికొట్టేందుకు సన్నద్ధంగా ఉండాలని తెలిపారు. ప్రజలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల కాలంలో చేసిన మేలును వివరించాలన్నారు. చంద్రబాబు అవినీతికి పాల్పడినా టీడీపీ నేతలు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, న్యాయమూర్తి తీర్పును సైతం తప్పుబడుతూ ఆరోపణలు చేయటం వారిలోని నీచమైన సంస్కృతికి నిదర్శనం అన్నారు. ఏలూరు నియోజకవర్గంలో సీఎం జగన్ పాలనలో ఏమి అభివృద్ధి చేశామో ప్రజలకు వివరించాలని జిల్లా అధ్యక్షుడు ఆళ్ళనాని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు ఆళ్ళనాని, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు తదితరులు ఉన్నారు.

విశ్వకర్మ కౌసల్య యోజనతో చేతి వృత్తులకు ప్రోత్సాహం


మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సంప్రదాయ చేతి వృత్తులను ప్రోత్సహించడమే లక్ష్యంగా రూ. 13 వేల కోట్లతో పీఎం విశ్వకర్మ కౌసల్య యోజన పథకం రూపొందించారని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామంజనేయ చౌదరి అన్నారు. ఆదివారం ఏలూరులో శ్రీ విరాట్ విశ్వకర్మ జయంత్యుత్సవాన్ని వైఎమ్‌హెచ్ఏ హాలులో విశ్వ బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన విశ్వకర్మ యజ్ఞ మహోత్సవంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామంజనేయ చౌదరి పాల్గొన్నారు. అనంతరం కేంద్రం నూతనంగా చేతివృత్తిదారుల కోసం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి విశ్వకర్మ కౌసల్య యోజన పథకాన్ని ప్రధాని నరేంద్ర మోదీ ఢిల్లీలో ఆవిష్కరించగా, వర్చువల్‌గా ప్రత్యేక ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటుచేసి ప్రదర్శించారు. ఈ సందర్భంగా సీతారామంజనేయ చౌదరి మాట్లాడుతూ దేశంలోని 18 రకాల వృత్తులలో ఉన్న లక్షలాది మందికి లబ్ధి చేకూర్చేలా ప్రధాని మోదీ ఈ పథకాన్ని ప్రారంభించడం ఆనందదాయకమన్నారు. వృత్తి సంఘాల కార్మిక నాయకులతో పాటు విశ్వబ్రాహ్మణ ధర్మపీఠం కన్వీనర్ అప్పలభక్తుల శివకేశవరావు పాల్గొన్నారు.

విశ్వకర్మ జయంతిని జాతీయ కార్మిక దినంగా ప్రకటించాలి


విశ్వకర్మ జయంత్యుత్సవంలో మాట్లాడుతున్న ఎంవీఎస్ నాయుడు

ఏలూరు (టూటౌన్): విశ్వకర్మ జయంతిని జాతీయ కార్మిక దినోత్సవంగా ప్రకటించాలని భారతీయ మజ్దూర్ సంఘ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంవీఎస్ నాయుడు కోరారు. విశ్వకర్మ జయంతి సందర్భంగా స్థానిక పడమర వీధి గాంధీమైదానం వద్ద ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆటో మెకానిక్ కార్మిక సంఘం అధ్యక్షుడు ఆగుల్ల రాజు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సత్యనారాయణ, వెంకటరమణ,మజ్జి నాగరాజు, కిషోర్, చంద్రమౌళి, భవన నిర్మాణ కార్మికులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ కార్యాలయంలో..


విశ్వర్మ జయంతిని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారి కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేశారు. జిల్లా వెనుబడిన తరగతుల సంక్షేమాధికారిణి ఆర్‌వీ నాగరాణి మాట్లాడుతూ విశ్వకర్మ సృష్టికర్తగా పరిగణిస్తారని తెలిపారు.

న్యాయవాది చిరంజీవికి సత్కారం


న్యాయవాది పుల్లగోర చిరంజీవిని అభినందిస్తున్న యాదవ సంఘ నాయకులు

ఏలూరు (టూటౌన్): న్యాయవాది పుల్లగోర చిరంజీవిని పలువురు నగర ప్రముఖులు అభినందించారు. స్థానిక జిల్లా యాదవ సంఘ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆదివారం సాయంత్ర ఆయనను సత్కరించారు. ఇటీవల ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక సత్రంపాడుకు చెందిన పుల్లగోర చిరంజీవి లా విభాగంలో గౌరవ డాక్టరేట్ అందుకోవడం గర్వకారణమని వక్తలు పేర్కొన్నారు. సన్మాన గ్రహీత డాక్టర్ పుల్లగోర చిరంజీవి మాట్లాడుతూ గత నెల 28న గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ చేతులు మీదుగా అవార్డును అందుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. యాదవ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు కిలారపు బుజ్జి,జిల్లా అధ్యక్షుడు చిదరబోయిన శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు ఉక్కుసూరి గోపాలకృష్ణ, కోశాధికారి గొర్ల రామారావు, ఏలూరు నగర అధ్యక్షుడు బొట్టా అజయ్, కోశాధికారి భోగా రాజేష్,రాష్ట్ర యువజన కార్యదర్శి మల్లిపూడి రాజు పాల్గొన్నారు.

సామాజిక న్యాయ పోరాట యోధుడు పెరియార్


పెరియార్ రామస్వామి నాయకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): సామాజిక న్యాయ పోరాట యోధుడు, సనాతన ధర్మం నిర్మూలనకు నిరంతరం పోరాడిన పెరియార్ రామస్వామి నాయకర్ 144వ జయంతిని ఏలూరులో ఘనంగా నిర్వహించారు. స్థానిక నరసింహారావుపేటలోని ఏఐవైఎస్ రాష్ట్ర కార్యాలయంలో సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మెండెం సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో పెరియార్ చిత్రపాటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంతోష్ కుమార్ మాట్లాడుతూ పెరియార్ గొప్ప సంఘ సంస్కర్త అన్నారు. వేల్పుల ప్రతిభ, బొల్లారపు నాగరాజు, గురుజుల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పది వేల గణపతి ప్రతిమల పంపిణీ


మట్టి గణపతి ప్రతిమలు పంపిణీ చేస్తున్న వ్యాపారవేత్త నారా శేషు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరానికి చెందిన ఎస్ హోటల్స్ ఆధ్వర్యంలో అవిఘ్నమస్తు కార్యక్రమం కింద నగరంలోని పలు ప్రాంతాల్లో 10 వేల మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేసినట్లు వ్యాపారవేత్త నారా శేషు తెలిపారు. ఆదివారం స్థానిక జ్యూట్‌మిల్ వద్ద ధర్మభేరి ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన గణపతి నవరాత్రి ఉత్సవాల పందిరి వద్ద నిర్వహించిన మట్టి గణపతి ప్రతిమల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా, ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఏటా మట్టి గణపతి ప్రతిమలను వినియోగించేలా ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. నగరంలోని నరసింహారావు పేట ఫాష్ టీమ్ కార్యాలయం వద్ద, సత్రంపాడు శ్రీ లక్ష్మీ గణపతి ఆలయం వద్ద, స్థానిక టీటీడీ కల్యాణ మండపం వద్ద, అమీనా పేట కాజ్‌వే వద్ద, తూర్పువీధి శివాలయం వద్ద ప్రజలకు గణపతి ప్రతిమలు పంపిణీ చేశామన్నారు.

విద్యతోనే ఆర్థిక, సామాజికాభివృద్ధి


వైద్య విద్యార్థులకు ఉపకారవేతనం అందజేసిన తూర్పుకాపు విద్యవిజ్ఞాన అభివృద్ధి సంఘ నాయకులు

ఏలూరు టౌన్: విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించేందుకు కృషి చేయాలని ఏలూరు నగర తూర్పుకాపు పరిరక్షణ కమిటీ చైర్మన్, సంఘ పెద్దలు బంకా ప్రసాద్ అన్నారు. ఏలూరు నగర తూర్పుకాపు విద్య విజ్ఞాన అభివృద్ధి సంఘం అధ్యక్షుడు లంక వెంకట రామ్మోహనరావు అధ్యక్షతన తూర్పుకాపు పేద విద్యార్థులు, మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేశారు. తూర్పుకాపుల్లో ఎంబీబీఎస్, బీడీఎస్ పూర్తిచేసి సేవలు అందిస్తున్న పలువురు వైద్యులను ఘనంగా సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. డాక్టర్ తుమరాడ మనోజ్, డాక్టర్ తుమరాడ ప్రశాంత్, డాక్టర్ ఎక్కడు రమాకాంత్, డార్టర్ బొరోతు మాన్విత, డాక్టర్ పిన్నింటి పూజా మహేశ్వరిని సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యతోనే సామాజిక, ఆర్థిక అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నగర కార్యదర్శి అలజంగి శ్రీనివాసరావు, వైస్ ఛైర్మన్ పిన్నింటి మహేష్, గౌరవాధ్యక్షులు మజ్జి కాంతారావు, సామంతుల లక్ష్మణరావు, కార్పొరేటర్ తుమరాడ స్రవంతి, కార్పొరేటర్ కత్తిరి రామ్మోహనరావు, రంగబాబు, ఏఎంసీ డైరెక్టర్ సాసుపల్లి యుగంధర్‌ప్రసాద్, డోల గురుమూర్తి, బంకా రామ్మోహనరావు, బొరోతు బాలాజీ, గొర్ల సాంబశివరావు, యాగాటి లక్ష్మీనారాయణ, సరిది రాజేష్ ఉన్నారు.